# అనుబంధం

ఆవిడ వయసు సుమారు ఆరు పదులు మించుకొంటున్న వృద్ధాప్యం గురించి తలకట్టు చెబుతోంది. జీవన యాత్రలో అలసట కళ్ళకింద నలుపుగా అలముకుంది. చిన్న ట్రంకు పెట్టె- పక్క చుట్ట- పతిసంచి- ఇవీ ఆవిడ సామాను పెట్టె బల్ల కింద పెట్టి- పక్క చుట్ట దాని మీద ఉంచి- "అమ్మగారూ ఇదే మీ బెర్త్ చివర సీట్లో కూర్చోండి కిటికీ పక్కనే" అని "మాస్టారూ? మీరెందాక వెళ్తున్నారు?" అడిగాడు ఆత్రతతో- వెంట వచ్చిన యువకుడు.

"ఢిల్లీ ఈ బోగీ ఢిల్లీ దాకా వెళుతుంది" అని చెప్పాను.

"నాయనా వాసూ నువ్వు దిగు ఈ రాజమండ్రి స్టేషనులో ఎక్కువ సేపు ట్రెయిను ఆగదు" అన్నదావిడ

యువకుడు దిగి కిటికీ దగ్గరకొచ్చాడు.

అతని కళ్ళు నన్ను అర్థిస్తున్నాయి.

"మాస్టారూ అమ్మగారు ఒక్కరే వెళ్తున్నారు కొంచెం చూస్తుండండి" బతిమాలుతున్నట్లు చెప్పాడు

"మీరు నిశ్చింతగా ఉండండి. పిన్నిగారిని భద్రంగా ఢిల్లీ చేర్చే పూచీనాది"

గార్డు విజిల్ వేశాడు రైలు బయలుదేరింది.

"అమ్మగారూ!నే ఉంటానండి హరిద్వారం చేరగానే ఉత్తరం రాయండి. మీకేంకావాలన్నా ఒక కార్డు ముక్క పడేయండి నే ఉండగా మీకేం లోటురానీను"

కిటికీ ఊచలు పట్టుకుని రైలుతో పాటు పరుగెడుతూ ఆవేదనతో చెబుతున్నాడు.

"మంచిది నాయనా ఇక ఉండు"

"నమస్కారం మాస్టారూ అమ్మగారి బాధ్యత తమదే" గట్టిగా చెప్పాడు కిటికీ చువ్వ వదిలివేస్తూ

రైలు వేగం పుంజుకుంది.

ప్రయాణికులు సరంజామా సర్దుకుని కుదుటపడేందుకు ఒక అర గంట పట్టింది మేం ఉన్నది రిజర్వ్డ్ బోగి సీట్లన్నీ భర్తీ అయ్యాయి కొత్తగా ఎక్కిన వాళ్ళ టిక్కెట్లు అడిగి తీసుకుని చార్టులో టిక్కులు పెట్టుకున్నాడు టి. టి. ఐ. ఆవిడ టిక్కెట్టు చూపించి తిరిగి సంచీలో జాగ్రత్తగా దాచుకుంది సంచీని చేత్తోనే ఇట్టుకుంది. అంత ఆవేదనతో అప్పగించి వెళ్ళాడు ఆ యువకుడు పిన్నిగారి భోగట్టా తెలుసుకోవాలని పించింది ఆవిణ్ణి చూసినప్పటి నుంచి నాలో ఏదో ఆప్యాయత చోటు చేసుకుంది ఎప్పుడోనన్నాడిలి పైలోకాలకి నాన్న దగ్గరకెళ్ళిపోయిన అమ్మ పోలికలు యదృచ్ఛికంగా ఆమెలో ఉండటం ఒక కారణం కావచ్చు.

ఆమె కిటికీలోంచి వేగంగా వెనక్కి పోతున్న పొలాలను చూస్తోంది గతాన్ని నెమరువేసుకుంటున్నట్టు ప్రసన్నంగా ఉన్నా మొహంలో దిగులు లాంటి భావరం కలిపిస్తోంది.

"పిన్నిగారూమీరేం దిగులుపడకండి నేనున్నా నా పేరు గోపాలం గోపీ అనండి తల్లిలాంటి వారు" పలకరించాను ధైర్యం చెబుతున్నట్టు

"అలాగే బాబూ నాకేం దిగులు లేదు" జీర్ణించుకున్న వేదాంతం చిరునవ్వుగా రూపుదాల్చింది.

"మాది విశాఖపట్నం పిన్నిగారూ నేను హరిద్వారం బి హెచ్ ఇ ఎల్‌లో పని చేస్తున్నాను. మిమ్మల్ని క్షేమంగా అక్కడికి చేర్చేపూచీ నాది.

"సంతోషం బాబూ సెలవు మీద వచ్చావా ? కోడలూ పిల్లలూ లేదా ?"

"అవును పిన్నిగారూ అక్కడే ఉన్నారు నేను ఒక వారం రోజులు సెలవుపైన వచ్చాను. ఇద్దరు పిల్లలు అబ్బాయి అమ్మాయి అక్కడే చదువుతున్నారు అయిదోక్లాసు మూడోక్లాసు స్కూళ్ళు మొన్ననే తెరిచారు."

"బాగుంది బాబూ ? కోడలి పుట్టిల్లు ఇటువైపేనా ?"

ఏలూరేదగ్గరి సంబంధమే పిన్నిగారూఇందాక స్టేషనుకొచ్చింది" సందేహ నివృత్తి కోసం అడిగాను.

ఆమె నా గొంతులోని అనుమానం గ్రహించి అతను నాకు కొడుకు లాంటి వాడే బాబూ ? చిన్నతనం నుంచి మాఇంట్లోనే పెరిగి పెద్దవాడయ్యాడు రాజమండ్రిలో ఎల్ ఐ సి లో పని చేస్తున్నాడు మా వారు పోయిన తరువాత అతను నాకు మూడో కొడుకయ్యాడు అంత అభిమానం.

"పూర్వ జన్మానుబంధం"

"అవును పిన్నిగారూ కొందరు చేసిన ఉపకారాన్ని జన్మలో మరిచిపోలేరు. అతను ఆ కోవకు చెందిన వాడులా ఉన్నాడు"

"బాగా చెప్పావ్ బాబూ"

ఒక్క నిముషం ఆలోచించుకుంటూ "చూడు బాబూ నువ్వి ఉండడం నాకు కొండంత అండగా ఉంది. నిజానికి మా అబ్బాయి వెంట ఉండి యాత్రచేయిస్తున్నట్టుగా ఉంది" అన్నప్పుడు గొంతులో కృతజ్ఞత ఉట్టిపడింది

"మీ అబ్బాయి రాజమండ్రిలో ఏం చేస్తున్నారు పిన్ని గారూ ?" కుతూహలం ఆపుకోలేక అడిగాను

"చెప్పడం మరిచాగదూ ? బాబూ నాకు ఇద్దరు కొడుకులు పెద్ద వాడు ఈమధ్య వరకూ కరణీకం చేసాడు అది కాస్తా రద్దయ్యాక ఆ ఊళ్ళోనే దస్తావేజులవీ రాస్తూ కాలం గడుపుతున్నాడు కొంచెం మాగాణి ఉంది ఇల్లుంది ఎలాగో కాలక్షేపం అవుతోంది".

"పిన్నిగారూ ఆడ పిల్లలందరికీ పెళ్ళిళ్ళు అయ్యే ఉండాలి అవునా ?"

వేదాంతినిలా చిన్నగా నవ్వి "దేవుడు నాకు ఇద్దరు మగ పిల్లల్నే ప్రసాదించాడు బాబూ ఆడ పిల్ల పెళ్ళి వగైరా బాదర బందీలేదు" అన్నప్పుడు మనసులో ఏదో లోటున్నభావం వెల్లడయింది.

పైకి మాత్రం గంభీర ముద్ర దాల్చింది నేను ఏమీ అనలేక పోయాను. ఆవిడ చెప్పేది శ్రద్ధగా వినాలని మాత్రం అనిపించింది.

"మా రెండోవాడు రాజమండ్రిలో బ్యాంకు ఆఫీసరుగా పనిచేస్తు న్నాడు'' కొంచెం తటపటాయించి "అర్జెంటు పని తగిలితే స్టేషనుకు రాలేకపోయాడు బాబూ" సంజాయిషీ ఇస్తున్నట్టు చెప్పింది.

నా కెందుకో ఆవిడ గుండెలో బాధ దాచుకున్నదా అనిపించింది. ఒకవేళ నేను భ్రమపడుతున్నానా అన్న సందేహం కూడా లేకపోలేదు.

అనుమాన నివృత్తికోసం "పిన్నిగారూ మీరు అదృష్ట వంతులని చెప్పాలి ఇద్దరు కొడుకులు ప్రయోజకులయారు చీకూ చింతా లేదు. పుణ్యక్షేత్రాలు దర్శించడం ఈ వయసులో చాలా మంచిది. అన్నాను.

"నిజమే బాబూ నాకేలోటూ లేదు. నన్ను కంటికి రెప్పల్లాచూసు కుంటున్న కొడుకులు దేవుడు ఒంట్లో ఓపిక ఇచ్చాడు కళ్ళూ చేతులూ నా స్వాధీనంలో ఉండగానే చూడదలుచుకున్న పుణ్య క్షేత్రాలు చూడా లనుకున్నాను"

"పిన్నిగారూ హరిద్వారం నుంచి ఋషికేశం కూడా వెళతారా ? అక్కడ ఎంత కాలం ఉంటారు?" తెలుసుకోవాలని అడిగాను.

ఒక్క క్షణం ఆలోచించి "ముందు హరిద్వారం వెళ్తాను అక్కడ పరిస్థితిని బట్టి ఎంత కాలం ఉండేది నిర్ణయించుకోవాలి మా ఇద్దరు పిల్లలూ ఆ సంగతి నా ఇష్టానికే వదిలిపెట్టారు అసల్ వెళ్ళొద్దనీ తమ దగ్గరే ఉండమనీ ఈ వయసులో శ్రమ ఎందుకు అనీ ఒకటే గొడవ నా కోడళ్ళు అంతే నాకెలాంటి ఇబ్బందీ కలగకుండా ఆదరంతోచూసు కునే కోడళ్ళు నన్ను విడిచి ఉండలేని కొడుకులూ అయినా దివ్య క్షేత్రాల వైపు మనసు లాగుతోంది బాబూ ఏమంటావు ? ఇలా వెళ్ళడం తప్పంటావా ?" కిటికీగుండా ఏటో చూస్తూ చెప్పింది.

"లేదు పిన్నిగారూ మీరు చేస్తున్న పని సబబైనదే ఈ మమతలు బంధాలు ఎప్పుడూ ఉండేవే హరిద్వారంలో ఎక్కడుండాలనుకుంటు న్నారు ? మీకు అభ్యంతరం లేకపోతే కొడుకునే అనుకుని మా ఇంట్లో ఉందురుగాని"

"చాలు నాయనా అంత మాటన్నావు అక్కడ మన వాళ్ళదే ఆంధ్రా ఆశ్రమం ఉంది గదా? అక్కడ ఉంటాను సత్కాలక్షేపం అవుతుంది మీ ఇంటికి వస్తూ పోతూ ఉంటాను"

ఇప్పటికే చాలా సంగతులు అడిగి విసిగించి ఉంటానేమో అనిపించింది అయినా ముఖ్యమైనవిషయాలన్నీ చెప్పనే చెప్పింది అక్కడితో అప్పటికి సంభాషణ ముగిసింది

ఇంగ్లీషు పత్రిక తీసి తిరగవేయడం మొదలు పెట్టాను.

పిన్నిగారూ సంచిలోంచి సుందరకాండ తీసి లోలోపల పారాయణం చేస్తోంది.

కాసేపయ్యాక ఆవిడవైపు తిరిగి చూశాను. సుందరకాండ ఒత్తు పెట్టుకుని అర రావు సైజు రూళ్ళకాయితం పైన రెండో వైపు ఉత్తరం కాబోలు రాస్తోంది ప్రతి మాటా తూచితూచి రాస్తున్నదా అనిపించింది ఏవేవో భావాలు కళ్ళల్లో తిరుగాడాయి. ఉత్తరం పూర్తి అయినట్టుంది ఒకసారి చదువుకుని చక్కగా మడత పెట్టి ముందే అడ్రస్సు రాసిఉన్న కవరులో కుదురుగా పెట్టి అంటించింది.

పెద్ద నిధి పట్టుకున్నట్టు కుడి చేత్తో భద్రంగా పట్టుకుని నావైపు తిరిగి "బాబూ? ఇది మా రెండో వాడికి రాసిన ఉత్తరం వాడి పనుల మూలంగా వచ్చేటప్పుడు సంగతులు మాట్లాడే వీలు చిక్కలేదు. తీరుబడిగా ఉన్నానాయే నాలుగు ముక్కలు రాశాను తరువాత మరిచిపోతానేమో? ఉండబాబూ? ఎక్కడైనా నీకు వీలుపడినప్పుడు ఏదైనా స్టేషన్లో డబ్బాలో వడెయ్ దీనికోసం వెళ్ళొద్దు ఇవ్వాళ కాకపోతేరేపు రెండ్రోజుల ప్రయాణం" అని చెప్పి కవరు నాచేతికిచ్చింది.

అడ్రసు చూడాలనిపించినా మర్యాదగా ఉండదని చూడకుండానే జాగ్రత్తగా లోపల జేబులో పెట్టుకున్నాను.

ఆవిడ నేను కవరు భద్రంగా లోపల జేబులో పెట్టుకోవడంచూసి బరువు తీరినట్టు నిట్టూర్చడం గమనించాను.

రైలు వేగంగా సాగిపోతోంది. పిన్నిగారు రాత్రిపూట పళ్ళుతప్ప ఇంకేమి తిననని చెప్పింది అరటి పళ్ళు వెంట తెచ్చుకున్నదావిడ వాటర్ బాగ్‌తో మంచినీళ్ళు మాత్రం తెచ్చిచ్చాను దానికే ఆవిడ సంబరపడి పోయింది నాకు కన్న తల్లినే వెంట తీసుకువెళుతున్న అనుభూతి కదిలింది.

రాత్రి తొమ్మిది గంటలకే బోగీలో సద్దుమణిగింది బెర్తులు వాల్చి పక్కలు వేసుకుని అంతా నడుం వాల్చారు.

పిన్నిగారూ పక్క చుట్ట విప్పుకుని కింద బెర్తు పైన పడుకుంది నాకూ నిద్ర పట్టింది.

రైలు మాత్రం కీచుకుంటూ పరుగెత్తుతోంది.

పిన్నిగారు బాగా దగ్గుతుంటే నాకు మెలకువ వచ్చింది ఇంతలో ఏదో స్టేషను వస్తే రైలు ఆగింది.

"పిన్నిగారు బాగా దగ్గుతున్నారే? మాత్రలున్నాయి ఇమ్మంటారా?" అడిగాను పై బెర్తు మీద నుంచి వంగి చూస్తూ

"వద్దులే బాబూ కాసిని మంచినీళ్ళు తాగితే సర్దుకుంటుంది టైమెంతయిఉంది బాబూ? ఏ ఊరో ఇది?"

నాకూ ఏ స్టేషనో తెలుసుకోవాలనిపించింది కిందికి దిగిటైము చూశాను.

"పిన్నిగారూ ఇప్పుడు నాలుగున్నర దాటింది"

మా సీట్లు తలుపుకు దగ్గర్లోనే ఉన్నాయి వెళ్ళి తలుపుతీసి స్టేషను పేరు చదివాను-"మంచిర్యాల" అని ఉంది పిన్నిగారికి చెప్పాను బయట వర్షం కురుస్తోంది విపరీతంగా

"అయితే తెల్లవారొచ్చిందన్న మాట !

"ఒక గంటలో తెల్లారుతుంది పిన్నిగారూ పడుకోండి" అని చెప్పినేను పై బెర్తు చేరుకున్నాను,

రైలు కెవ్వున కేక పెట్టి బయలుదేరింది పిన్నిగారు దగ్గుతూనే ఉంది నాకు నిద్ర పట్టలేదు కళ్ళు మూసుకున్నాను నిద్రపడుతుందేమోనని

ఉన్నట్టుండి పెద్ద శబ్దమయింది గాబరాపడ్డాం మాబోగీపక్కకు ఒరిగి పోయింది క్షణంలో నీరొచ్చిపడింది లైట్లు పోయాయి అన్ని వైపులా ఏడ్పులు హాహాకారాలు

"పిన్నిగారూ ? పిన్నిగారూ?" అని అరిచాను నోట్లోకి నీరు పోతున్నా కొట్టుమిట్టాడాను అంతా జలమయం ప్రాణం పోతున్న స్థితి మనసు పని చేయలేదు స్పృహా కూడా తప్పుతోంది నీళ్ళు మింగుతున్నాను ఎవరో నన్ను బలవంతంగా బయటికి తీసుకుపోతున్నారు భుజం మీద వేసుకుని అనిపించింది అతని గడ్డం తలపాగా తగిలి శిక్కు అనుకున్నా తరువాత స్పృహ లేదు

నాకు స్పృహ వచ్చి చూస్తే అంతా భయంకర వాతావరణం ఆసుపత్రి కిక్కిరిసి ఉంది అవసాన దశలో ఉన్న వారు ప్రాణాలు పోయిన వారు ఆపుల కోసం రోదించే వారు

నేను ఎలా బ్రతికానో తెలియదు. పిన్నిగారి జాడలేదు.

డాక్టరొచ్చి పరీక్ష చేశారు.

"నౌ యూ ఆర్ ఓ. కే. భయం లేదు" – అన్నాడు భుజం తట్టుతూ.

స్వచ్ఛంద సేవకులు కాబోలు మాకు కాఫీ అందించారు. ప్రాణం కొంచెం కుదుటపడింది. లేచి ఆసుపత్రి అంతా గాలించాను. పిన్నిగారి అచూకీ లేదు.

తరువాత వాకబు చేశాను. మేము ప్రయాణం చేస్తున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఘోర ప్రమాదానికి గురి అయ్యిందనీ, అమరాద్రి గ్రామంలో హమీరాజ్ చెరువు పొంగి గట్టు తెగి రైలు మార్గాన్ని కోసేసిందని చెప్పారు. మూడు రోజులుగా కురిసిన విపరీతమైన వర్షాల వల్ల ఇలా జరిగిందని చెప్పారు.

నా సామాను పోయినా ప్రాణాలు దక్కాయి. డబ్బూ, కాగితాలూ లోపల జేబులో పెట్టుకున్నందువల్ల పోలేదు, తడిసిపోయాయి.

ఆ ఊళ్ళో ఉన్న హైస్కూల్లో తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. మమ్మల్ని నాగపూర్ మీదుగా ఢిల్లీ చేర్చేందుకు ముందు బెల్లంపల్లి తీసుకువెళ్తున్నారు. పిన్నిగారి కోసం శాయశక్తులా వెదికాను. వరద నీటికి రెండు బోగీలు కొట్టుకుపోయాయి ఇసుక, మట్టి పేరుకుపోయింది. పిన్నిగారు వరద నీటిలో కొట్టుకుపోయిందో, మట్టిలో సమాధి అయిందో ఏమో ? నిస్సహాయంగా నా హృదయం విలపించింది.

కాగితాలు తీసి చూశాను, తడిసిపోయాయి. పిన్నిగారిచ్చిన కవరు తడిసింది. అడ్రసు అలుక్కుపోయింది. ఎండబెట్టాను. ఏం చేయాలో తోచలేదు. కొడుక్కి ఉత్తరం. ఈ కబురు ఎలా చేరుతోందో తోచలేదు. పేరు ఉంటుందేమోనని అనుకున్నా తడిసిన కవరు తేలికగా వచ్చేసింది

ఉత్తరం చదవకుండా ఉండలేకపోయాను.

"చిరంజీవి సత్యానిక....

మీ అమ్మ దీవించి వ్రాయునది. నేను ఈ ఉత్తరం రైలు ప్రయాణంలో రాస్తున్నాను. నేను ఎక్కడికి వెళ్ళిపోయానో అని నువ్వు కొన్ని రోజుల తరువాతనైనా కలతపడతావేమోనని ఇంత త్వరగా రాయవలసి వచ్చింది. హరిద్వారం వెళ్తున్నాను. దేవుడు దయదలచినంత కాలం అక్కడే ఉంటాను.

"నేను వెళ్ళిపోవడం నీకూ, చి సౌ మాధవికి సమ్మతమే కదా! మీ మీద కోపంతో ఇలా బయలుదేరలేదు. నా మనసుకు ఇదే మంచిదనిపించింది. ఇద్దరు కొడుకులుండగా హరిద్వారం ఎందుకు వెళ్ళాలని ఎవరైనా అనుకోవచ్చు. లోకులతో మనకేం పని?

"చిన్నా? నేను నిన్ను కన్న తల్లినిరా నీ మనసు ఏ మాత్రం నొచ్చుకున్నా నా గుండెల్లో శూలాలతో పొడిచినట్లవుతుంది. రక్తం పిండి పాలుగా మార్చి నిన్ను పెంచిన తల్లినిరా. మీ పైన కోపం ఏ జన్మ? లోనూ ఉండదు.

"సరిగ్గా వారం రోజులక్రితం నువ్వూ చి సౌ. మాధవి నాగురించి తర్జన భర్జన పడడం నా చెవికి వినిపించింది. అన్నయ్య నన్ను మరి కొన్ని రోజులు నీ దగ్గర ఉంచుకోమని నిక్కచ్చిగా రాయడం వాడి తప్పే వదిన కూడా అలాగే భావిస్తున్నట్టు మీ మాటల్లో తెలిసింది. అయితే మీ ఇద్దరికీ అంత వెర్రికోపం ఎందుకురా తండ్రీ నామీద? నేను ముసలిదాన్నే "ఈ ముసల్దాని పీడ ఎప్పుడు విరగడవుతుందో" అని చి. సౌ. మాధవి అంటే-"ఇక్కడ బాగా తినమరిగి ముసల్ది కదలకపోతే ఒక వారం చూసి పొమ్మంటాను" అని నువ్వు బదులు చెప్పావు. చిన్నా నువ్వు ఎన్ని అన్నా నీ పైన నీ తల్లికి కోపం రాదురా జాలి పడుతున్నా పెద్దాడి పై కూడా కోపం లేదు. వాడికీ నే బరువయ్యాను. కానీ నా బిడ్డలు నా బిడ్డలే.

"ఒక నిర్ణయానికొచ్చాను. నాకు ఎప్పటి నుంచో హరిద్వారం చూడాలని ఉంది. మన వాసు దగ్గరికెళ్ళి చెప్పాను వాడెంతో బాధ పడ్డాడు. నా తగ్గరున్న నా గాజులు, గొలుసు అమ్మించాను. టిక్కెట్టు రిజర్వు చేయించాడు. కొంత పైకం తీసుకున్నాను. వాసు నెల నెలా కొంతడబ్బు పంపుతాడు. వాడు నాకు మూడో కొడుకు లాంటివాడు. ఆ సంగతి నీకు తెలుసు. బంగారం అమ్మిన పైకం అయిపోయినా వాడ జీతం లోంచి నాకు పంపుతాడు. మీకా ఇబ్బంది లేదు.

"కొంత కాలం హరిద్వారంలో గడుపుతాను. తరువాత దైవేచ్ఛ. మళ్ళీ ఉత్తరం రాస్తాను. చి.సౌ. మాధవికి ఆశీస్సులు. పిల్లలకి దీవెనలు

ఇట్లు మీ అమ్మ

అనసూయ."

గుండెల్లో అగ్నిపర్వతం దాచుకున్న పిన్నిగారి ఉత్తరం ప్రమాదం కబురు ఎలాగైనా రెండో కొడుక్కి పంపాలనుకున్నాను. పేరూ, అడ్రస్సూ తెలియదు. వాసు పేరుతో రాజమండ్రి ఎల్ ఐ.సీ.కి పంపితే చేరుతుందనే నమ్మకం ఉంటి. కవరు మడిచి జాగ్రత్తగా జేబులో పెట్టుకున్నారు.

బెల్లంపల్లికి మమ్మల్ని తీసుకు వెళ్లే బస్సు కదిలింది

హరిద్వారం జాగ్రత్తగా చేరుస్తానని పిన్ని గారికి మాటిచ్చాను. కాని మంచిద్యాలే అవిడకి హరిద్వారం అయ్యింది. ఆమెకి శాశ్వతస్థానం ఇదే మోక్షదాయకమైన హరిద్వారం ఇదే కన్నీటి తర్పణం చేసి శ్రద్ధాం జలి ఘటించాను

పిన్నిగారిని తన గర్భంలో దాచుకున్న ఆ ఊరు పొలిమేరలు దాటి బస్సు పరుగుతీసింది.